# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- పేదవారి ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు ప్రారంభించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ రోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఏర్పాటు చేశారు.
- అభివృద్ధి, సంక్షేమాలను నిరవధికంగా కొనసాగించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.
- ప్రజాస్వామ్యంలో చట్ట సభలు దేవాలయాల వంటివని శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పేదవారి ఆకలి తీర్చే అన్న క్యాంటిన్లను పునః ప్రారంభించడం ఆనందరంగా ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రోజు ముఖ్యమంత్రి విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాలలో ముఖ్యమంత్రి పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం గుడివాడ చేరుకుని తొలి అన్న క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా తొలిదశలో 100 అన్న క్యాంటిన్లను ప్రారంభించామని తెలిపారు. తక్కువ ఖర్చుతో పేదవారు మూడు పూటలా కడుపునిండా భోజనం చేసేందుకు అన్న క్యాంటిన్లు పని చేస్తాయన్నారు. కృష్ణా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహకాలు కల్పించి, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

(వాయిస్ 25 సెకన్లు)

అన్న క్యాంటీన్లలో ఒక్కొక్కరికీ పూటకు 5 రూపాయల చొప్పున మూడు పూటలా అల్పాహారం, భోజనం అందిస్తామన్నారు. ఒక పూటకు 35 వేల మందికి వీటి ద్వారా ఆహారం లభించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా మరో 99 అన్న క్యాంటిన్లు రేపు ప్రారంభం కానున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈరోజు సాయంత్రం రాజ్ భవన్‌లో తేనీటి విందు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, పలువురు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిళ, హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ “ఎట్ హోం” కార్యక్రమానికి హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం షణ్ముఖ వ్యూహంతో ముందుకు వెళుతున్నామని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈరోజు ఆయన కాకినాడలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 78 సంవత్సరాల కాలంలో దేశం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొందని, విభజన గాయాలు, యుద్ధాలు, క్షామం వంటివి దేశం చూసిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగడం, పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా నిలపడం, అభివృద్ధి, సంక్షేమాలను ఎటువంటి అవరోధాలు లేకుండా కొనసాగించడం ఇవే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు రాజీలేకుండా అమలు కావాలని, యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న మాదక ద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ ఆవిష్కృతం అవ్వాలని ఆకాంక్షించారు.

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజాస్వామ్యంలో చట్ట సభలు దేవాలయాలాంటివని, అక్కడ అర్థవంతమైన చర్చలు జరిగినప్పుడే వాటిపై గౌరవం పెరుగుతుందని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆరోజు ఆయన రాష్ట్ర శాసన సభ వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొని, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛాయుత జీవనమని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తించుకోవాలన్నారు. పౌరులందరూ బాధ్యతాయుతంగా ఉండి... తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం అందరం కలిసి పని చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి పిలుపునిచ్చారు. విజయవాడలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఈరోజు ఆమె స్వాతంత్ర్య దినోత్సవాలలో పాల్గొన్నారు. అనంతరం సమస్యల స్వీకరణ వారధి కార్యక్రమాన్ని, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల వారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి “వికసిత్ భారత్”ను చూడాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. సమస్యల స్వీకరణ నిరంతరం కొనసాగుతుందని, అదేవిధంగా వాటి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఈ రోజు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సి. సుబ్బారావు జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు, త్యాగధనుల ప్రాణార్పణతో సిద్ధించిన ఈ స్వతంత్ర్య

భారత దేశాన్ని వారి ఆశయాల మేరకు మరింత అభివృద్ధిపథంలో నడిపించాల్సిన బాధ్యతను ప్రస్తుత తరం విస్మరించకూడదని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "ఏక్ పేడ్ మా కె నామ్" "అమ్మ పేరున ఒక మొక్క నాటుదాం)" పిలుపుమేరకు అగనంపూడి లోని ఆకాశవాణి రీలే కేంద్రం ప్రాంగణంలో ఆకాశవాణి సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అభివృద్ధి సంక్షేమ పథకాలు పేదలందరికీ అందినపుడే సమ సమాజ స్థాపన జరుగుతుందని రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు అన్నారు. అసెంబ్లీ వద్ద ఈరోజు జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడుతూ... స్వాతంత్ర్యం సాధించిన త్యాగధనుల కృషి ఫలితంగానే ఈరోజు మనం స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నామన్నారు. 200 సంవత్సరాలకు పైగా పరాయి పాలన తరువాత మనదేశం రాజ్యాంగం ఏర్పాటు చేసుకుని, అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు హక్కులు కల్పించబడ్డాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతోందని మోషేన్ రాజు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయం, నీటిపారుదల, పారిశ్రామిక రంగాలను మరింత అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈరోజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... వ్యవసాయ పరంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ జిల్లాలో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, పోర్టు ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి... వివిధ శాఖల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళుతోందని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని అక్షర విద్యాలయంలో ఈరోజు ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రధానమంత్రి చేపడుతున్న సంస్కరణలతో దేశం అన్ని రంగాల్లో ముందుకు వెళుతోందన్నారు. రాబోయే తరాలకు ప్రకృతి విలువను తెలియజేసేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆగ్నేయ అరేబియా సముద్రం, దక్షిణ కేరళ తీరం మీదుగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తు వరకు కొనసాగుతున్నట్టు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ఉరుములతో కూడిన మెరుపులు, బలమైన ఉపరితల గాలులు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =